సాక్షి
నిర్మల్
శుక్రవారం । 19 । జనవరి । 2024



హోరాహోరీగా ఐఎస్‌ఎల్
ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం వివిధ పోటీలు నిర్వహించారు. 8లో▸



రేపు నవోదయ ప్రవేశ పరీక్ష
జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. 10లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
31.3 /18.9
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. వేకువజామున పొగ మంచు కురుస్తుంది.

మిల్లింగ్.. కష్టం


భైంసాలోని ఓ రైస్ మిల్లులో బుధవారం తనిఖీలు నిర్వహించిన అధికారులు

- సీఎంఆర్‌పై మిల్లర్ల మల్లగుల్లాలు..!
- నెలాఖరులోగా టార్గెట్ పూర్తికి అధికారుల ఒత్తిడి
- మిల్లులవారీగా తహసీల్దార్లకు బాధ్యతలు
- అప్పగించనివారిపై చర్యలకు సమాయత్తం

భైంసాటౌన్: కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అప్పగింతలో జాప్యంపై జిల్లా అధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఈనెలాఖరులోగా వందశాతం మిల్లింగ్ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 60 శాతమే సీఎంఆర్ పూర్తయింది. గత 2022-23 ఖరీఫ్/రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ పూర్తికి డిసెంబర్ వరకే గడువు ఉండగా, లక్ష్యం పూర్తి కాకపోవడంతో జనవరి 31 వరకు గడువు పెంచారు. ఈ గడువులోగా వందశాతం మిల్లింగ్ పూర్తి చేసేలా అధికారులు మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు. తీవ్ర జాప్యం చేసిన కొన్ని మిల్లులపై కేసులు సైతం నమోదు చేశారు.

రీ సైక్లింగ్..
దీంతో రైస్‌మిల్లర్లు ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది మిల్లర్లు బియ్యం అప్పగించేందుకు అడ్డదారులు సైతం తొక్కుతున్నారు. దళారుల నుంచి పీడీఎస్ బియ్యం సేకరిస్తూ వాటినే రీసైక్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారు. రెండురోజుల కిందట భైంసా మండలం దేగాం గ్రామం వద్ద 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టుబడగా, అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుబడిన సందర్భాలు సైతం ఉన్నాయి.

గడువులోగా ఇవ్వాల్సిందే...
2022-23 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు ఉండగా, ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. వాస్తవానికి డిసెంబర్‌తోనే గడువు ముగియగా, మిల్లర్ల అభ్యర్థన మేరకు జనవరి 31వరకు గడువు పొడిగించారు. ఈ గడువులోగా బియ్యం అప్పగించాలని అధికారులు మిల్లర్లపై ఒత్తిడి చేస్తున్నారు.

తహసీల్దార్లకు బాధ్యతలు..
సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేసేలా మండలాలవారీగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. రోజువారీగా సీఎంఆర్ లక్ష్యం చేరుకునేలా వీరు మిల్లింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో తహసీల్దార్, డీటీకి నాలుగు నుంచి ఐదు మిల్లుల పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. గడువులోగా బియ్యం అప్పగించాలని, లేనిపక్షంలో మిల్లర్లపై చర్యలకు సిద్ధమవుతున్నారు. అవసరమైతే జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేయడం లేదా ఆర్అండ్‌ఆర్ చట్టం ప్రయోగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

నెలాఖరులోగా కష్టమే
2022-23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 58 రైస్ మిల్లులకు 1.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ కోసం కేటాయించారు. 1.12 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. ఇప్పటి వరకు దాదాపు 67 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించారు. అంటే లక్ష్యంలో 60 శాతమే పూర్తి చేశారు. నెలాఖరుకు 10 రోజులే గడువు ఉంది. మిగిలిన లక్ష్యం చేరుకోవడం గగనమే. దీంతో అధికారులు సైతం వీలైనంత వరకు ఎక్కువ మొత్తంలో బియ్యం అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

బీట్‌రూట్.. 'సమాఖ్య' గ్రేట్


కలెక్టరేట్‌లో సమీకృతంగా పండించిన బీట్‌రూట్, కూరగాయలు విక్రయిస్తున్న విజయలక్ష్మి

- 'సమీకృతం'లో పండించి..
- కలెక్టరేట్‌లో విక్రయించి..
- భేష్.. అనిపించుకున్న డీఆర్డీవో

నిర్మల్: సాగును నమ్ముకున్న రైతన్న ఆర్థికంగా ఎలా ఎదగవచ్చో.. ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అధికారులు, సిబ్బందే రైతులు, రైతు కూలీలుగా మారి సాగులో భాగమయ్యారు. ఆకు కూరలు, కాయగూరలే కాదు.. అసలు జిల్లాలో పండుతుందో.. లేదోనన్న బీట్‌రూట్, క్యారెట్ వంటి పంటలనూ పండించి చూపించారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు స్వయంగా అందించి భేష్.. అనిపించుకున్నారు.

అధికారి ఆలోచనతో..
జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్డీవో) విజయలక్ష్మి చొరవతో నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్‌లో చేపట్టిన సమీకృత వ్యవసాయం సక్సెస్ అయ్యింది. ఇది పూర్తిగా నిర్మల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలోనే సాగు చేయడం విశేషం. గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి భూమిని లీజుకు తీసుకున్నారు. రెండెకరాల్లోనే ఐదంచెల విధానంలో ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారు. అరుదైన మొక్కలను, వీటితోపాటు చేపలు, నాటుకోళ్లు, మేకలు పెంచుతున్నారు. రైతులు తమకున్న భూమి


కలెక్టర్‌కు బీట్‌రూట్ అందిస్తున్న డీఆర్డీవో

సాగుతోపాటు సంపాదన ఎలా పెంచుకోవచ్చో చూపిస్తున్నారు.

బీట్'రూట్' చూపించారు..
బీట్‌రూట్, క్యారెట్ వంటివి జిల్లా నేలల్లో పండించవచ్చని డీఆర్డీవో బృందం నిరూపించింది. సమీకృతంలో భాగంగా వేసిన బీట్‌రూట్ మంచిగా రావడంతో వారంతా చాలా సంతోషించారు. తాము పండించిన బీట్‌రూట్, పలు కూరగాయలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్‌కు గురువారం అందించారు. వారు డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు, సమాఖ్య బాధ్యులను గ్రేట్.. అంటూ అభినందించారు. అనంతరం అక్కడే కలెక్టరేట్‌లో స్టాల్ పెట్టి వాటిని సిబ్బందికి విక్రయించారు. ఒక్కరోజులోనే కేవలం బీట్‌రూట్ విక్రయంతో రూ.3 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 26న గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకలపై అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి జిల్లా అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. నూతన కలెక్టరేట్‌లో మొదటిసారిగా గణతంత్ర వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు. పోలీస్, రెవెన్యూ, విద్య, వైద్యం, విద్యుత్, డీఆర్డీవో శాఖలు సమన్వయతో స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు జిల్లా అధికారులు, సిబ్బంది అందరూ హాజరు కావాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

20న ఉచిత గుండె వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా కిమ్స్ హాస్పిటల్ వైద్యులతో ఈనెల 20న జిల్లా ప్రసూతి ఆస్పత్రిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సందీప్ ఈ శిబిరానికి హాజరవుతారని పేర్కొన్నారు. 8 ఏళ్లలోపు పిల్లలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. భైంసా సబ్ డివిజన్ పరిధిలోని కుభీర్, భైంసా, కుంటాల మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పదవీకాలం పొడిగించాలి


వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ కోరారు. జిల్లా సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఏడాదిన్నరగా ఎస్ఎఫ్‌సీ నిధులు రాష్ట ప్రభుత్వం ఇవ్వడం లేదని తె లిపారు. కోవిడ్ కారణంగా చెక్ పవర్ ఇవ్వకపోవడంతో రెండున్నరేళ్లు ఎలాంటి అధికారం లేకుండా వృథా అయిందని తెలిపా రు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియగానే ప్రత్యేక అధికారులను నియమించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. వినతిపత్రంఇచ్చినవారిలో సర్పంచులు భూమేష్, హన్మగౌడ్, ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

'ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి'

నిర్మల్ రూరల్: ఇన్ సర్వీస్ టీచర్లకు పదోన్నతుల విషయంలో టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ కోరారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ)నిబంధనల్లో 2010 తర్వాత ఉపాధ్యాయ నియామకాలకు ఇది కనీస అర్హతగా మాత్రమే ఉందని గుర్తు చేశారు. అంతకుముందు నియామకమైన ఉపాధ్యాయులకు నోటిఫికేషన్లలో గానీ, నియామకపు పత్రాలలోగానీ టెట్ షరతులు విధించలేదని తెలిపారు. టెట్ నిబంధనపై స్పష్టత లేక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్లాన్ రూపొందించి ఈనెల 27లోగా గ్రామసభల్లో తీర్మానం చేయాలని, ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎంపీడీవోలను ఆదేశించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్లాన్ తీర్మానాలు, ఉపాధి హామీ పనులపై మండలాల వారీగా అదనపు కలెక్టర్, సీఈవో, ఎంపీడీవోలు, ఏపీవోలతో గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రతీ మండలంలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించి 2024-25 సంవత్సరానికిగాను గ్రామ పంచాయతీ సెక్రటరీ నోడల్ అధికారిగా గ్రామ అభివృద్ధి ప్లాన్ రూపొందించుకుని ఈనెల 27న గ్రామ సభల ద్వారా తీర్మానం రూపొందించాలని, జనవరి 31 లోగా సంబంధిత ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని వివరించారు. గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనుల తీర్మానాలను పరిశీలించి గ్రామ పంచాయతీలలో కవర్ కాని పనులను మండల స్థాయి అభివృద్ధి ప్లాన్‌లో ఫిబ్రవరి 7వ తేదీలోగా తీర్మానం చేసి 10వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 16లోపు తీర్మానం చేసి 20వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు, ఇతర పంచాయతీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీర్మానాలు చేయాలని సూచించారు.

కూలీలందరికీ పని..
ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, పనులపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. అర్హులైన కూలీలందరికీ పని కల్పించాలని సూచించారు. గ్రామ అవసరాల మేరకు పనులపై తీర్మానం చేయాలన్నారు. కూలీల హాజరు మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. చేసిన పనుల వివరాలను భువన సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ పారిశుధ్య పనులపై ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. నర్సరీల్లో మొక్కలన్నీ బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం వాటరింగ్ డే చేపట్టాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి సుధీర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికభావన పెంపొందించుకోవాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


మాట్లాడుతున్న కూచాడి శ్రీహరిరావు

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీగండి రామన్న సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. రూ.51,116 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో పుణ్యకార్యం అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారని, భక్తుల సౌకర్యం కోసం నిర్వహించ తలపెట్టిన నిత్య అన్నదాన కార్యక్రమానికి దాతలు తమకు తోచిన విరాళాలు అందజేయాలని కోరారు. పుట్టినరోజు, పెళ్లిరోజు తదితర శుభ కార్యక్రమాలను పురస్కరించుకుని, ఇక్కడి ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములై సాయి కృపకు పాత్రులు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పూదరి నరహరి, కాంగ్రెస్ నాయకులు కొట్టే శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

- ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలి
- దర్యాప్తులో ఉన్న కేసుల్లో సమగ్ర విచారణ చేపట్టాలి
- ఎస్పీ జానకి షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌టౌన్: వివిధ రకాల సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో, సహాయం కోసం వచ్చే బాధితులతో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలోని పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్ష గురువారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నెలలో డిస్పోసల్ అయిన కేసులపై ఆరా తీశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గత నెలలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాల్లో పకడ్బందీగా విచారణ చేసి, నిందితులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తులో ఉన్న కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితుల్లో నమ్మకం పెంచాలన్నారు. పోక్సో, అట్రాసిటీ, గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పోలీస్ శాఖలో వినియోగిస్తున్న నూతన టెక్నాలజీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కోర్టు విధులు నిర్వహించే పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించి సాక్షులను ప్రవేశపెట్టి నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని వివరించారు. ఆస్తి సంబంధ నేరాలు జరగకుండా ముందస్తు సమాచార సేకరణ చేస్తూ, రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నేరాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రదేశాలను హాట్‌స్పాట్‌గా గుర్తించి పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతీ పాయింట్ బుక్‌ను తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్, అదనపు ఎస్పీ వీరన్న, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ పురుషోత్తం, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఐటీ సెల్ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్పీ జానకి షర్మిల

జిల్లా పోలీస్ వార్షిక క్యాలెండర్‌ను ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపర్చుకుని, శాంతి భద్రతల పరిరక్షణకు మరింత పదును పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరన్న, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏపీపీలు రామకృష్ణ, సతీశ్, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి

- ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి
- వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


సమీక్షకు హాజరైన వైద్యాధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో సిజేరియన్ కాన్పులు తగ్గించి సాధారణ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో వైద్యాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అన్ని మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్సీ వివరాలు, రిజిస్టర్ నమోదు, ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, నార్మల్ డెలివరీల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనీమియా సే ముక్త్ నిర్మల్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని, ఆరు హామీల్లో వైద్యానికి సంబంధించిన ఆరోగ్యశ్రీ పరిమితి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో పేదలు ఎక్కువగా ఉంటారని, వారికి అందుబాటులో ఉండి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

పునరావాస భూములకు హద్దుల ఏర్పాటు


హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కడెం: మండలంలోని పెత్తర్పు సమీపంలో రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాలకు కేటాయించనున్న వ్యవసాయ భూములకు హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా 2.32 గుంటల చొప్పున 94 కుటుంబాలకు అందజేయనున్నారు. గురువారం పది కుటుంబాలకు అప్పగించే భూమికి హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో డీఆర్వో ప్రకాశ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

'పునశ్చరణ'పై పట్టింపేది..!


ఉదయం 9 గంటలకు తెరుచుకోని ఏపీనగర్ పాఠశాల

భైంసాటౌన్: సంక్రాంతి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఉదయం, సాయంత్రం పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశాలున్నాయి. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, అలాగే సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు రోజువారీగా పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. సెలవుల తర్వాత పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో, పట్టణంలోని ఏపీనగర్ జెడ్పీఎస్ఎస్, మదీనా కాలనీ ప్రభుత్వ బాలుర/బాలికల ఉన్నత పాఠశాలల్లో పరిశీలించగా పునశ్చరణ తరగతులు నిర్వహించిన దాఖలాలు కనిపించలేదు. ఉదయం 9 గంటలు దాటినా ఉపాధ్యాయులు రాకపోవడంతో వచ్చిన ఒకరిద్దరు విద్యార్థులు పాఠశాల వద్ద వేచి ఉండడం కనిపించింది. ఏపీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థినితో తరగతి గది శుభ్రం చేయించడం కనిపించింది. ఈ విషయమై ఉపాధ్యాయుడిని వివరణ కోరగా, స్వీపర్లు లేకపోవడం, పారిశుధ్య కార్మికులు పట్టించుకోకపోవడంతో ఇలా నెట్టుకురావాల్సి వస్తోందని సమాధానమిచ్చారు.


ఏపీనగర్‌లో పాఠశాలను శుభ్రం చేస్తున్న విద్యార్థిని

క్లుప్తంగా

నిర్మల్ చేరిన అయోధ్య లడ్డూ

నిర్మల్‌టౌన్ :హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ భక్తుడు ఎస్.నాగభూషణంరెడ్డి 1,265 కిలోల లడ్డూను అయోధ్యకు తీసుకెళ్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో శ్రీరామ భక్తులు గురువారం ఘన స్వాగతం పలికారు. అయోధ్య రామ మందిరం నిర్మాణం మొదలుపెట్టిన రోజు నుండి ఒక్కో కిలో చొప్పున శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన వరకు 1,265 కిలోల లడ్డును తయారుచేసి అయోధ్యకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి విజేత ఆదిలాబాద్ జట్టు



విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్ -14 విభాగంలో ఆదిలాబాద్ జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ కైవసం చేసుకుంది. సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం మెదక్ జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో 3-1 తేడాతో విజేతగా నిలిచినట్లు జట్టు మేనేజర్ స్వామి తెలిపారు. జిల్లా జట్టు విజేతగా నిలవడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, పెటా అధ్యక్షుడు పార్థసారథి, తదితరులు అభినందించారు.

'అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

పాతమంచిర్యాల: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్, జై భీం సైనిక్‌దళ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆసాది పురుషోత్తం డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి గంటల వ్యవధిలోనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పునరాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహనాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలిటెక్ శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మార్త కుమారస్వామి, జిల్లా కార్యదర్శి గోక శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి నక్క శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లిలో వేములపల్లి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పత్తి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఇంట్లో సుమారు 50 క్వింటాళ్ల పత్తిని నిల్వ ఉంచగా గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పత్తికి నిప్పంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలు ఆర్పివేశారు. ఘటనలో సుమారు 15 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పత్తి విలువ సుమారు రూ.1.50 లక్షల వరకు ఉంటుందన్నాడు. ఆదుకోవాలని కోరుతున్నాడు.

హోరాహోరీగా ఐఎస్ఎల్

- వివిధ పోటీల్లో క్రీడాకారుల సత్తా
- బహుమతులు ప్రదానం చేసిన అతిథులు



మెడల్స్ అందజేస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం రెండోరోజు హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హైజంప్, లాంగ్‌జంప్, పరుగు పందెం, డిస్క్‌త్రో పోటీలు నిర్వహించారు. 100 మీటర్ల పరుగుపందెం (అండర్-14) విభాగంలో జాతర్ల ఆశ్రమ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్, ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ విక్రం గోల్డ్‌మెడల్ సాధించారు. 600 మీటర్ల విభాగంలో ఉట్నూర్ స్పోర్ట్స్ విద్యార్థి కొడప పరుశురాం గోల్డ్ మెడల్, హుజూర్‌నగర్‌కు చెందిన ప్రవీణ సిల్వర్‌మెడల్, షాట్‌పుట్ విభాగంలో బాయ్స్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి చరణ గోల్డ్ మెడల్, ఉట్నూర్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి మర్సుకోల ఇందూర్ షావ్ సిల్వర్ మెడల్ సాధించారు. 100 మీటర్ల పరుగుపందెం (అండర్-17) విభాగంలో కొలికొండ పాఠశాలకు చెందిన శివప్రసాద్ గోల్డ్ మెడల్, చిలుకూర్ పాఠశాలకు చెందిన రాజేశ్ సిల్వర్ మెడల్, 800 మీటర్ల విభాగంలో ముత్కల్ విద్యార్థి బసంత్ గోల్డ్ మెడల్, జేపీనగర్ విద్యార్థి సంతోశ్ సిల్వర్ మెడల్ సాధించారు. హైజంప్ అండర్-14 విభాగంలో జాతర్ల పాఠశాలకు చెందిన మడావి సోము గోల్డ్ మెడల్, చిట్యాల్‌కు చెందిన మురళీ కృష్ణ సిల్వర్ మెడల్, డిస్క్‌త్రోలో నల్గొండకు చెందిన పవన్‌కుమార్ గోల్డ్ మెడల్, ఉప్పల్‌వాయికి చెందిన గౌతమ్ సిల్వర్‌మెడల్, హైజంప్ అండర్-17 విభాగంలో ఉట్నూర్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి జాదవ్ శ్రీకాంత్ గోల్డ్ మెడల్, హరిప్రసాద్ సిల్వర్ మెడల్, లాంగ్‌జంప్ విభాగంలో భద్రాచలంకు చెందిన వెంకటేశ్వర్‌రావు గోల్డ్ మెడల్, ఎస్‌కూర్ పాఠశాల విద్యార్థి చరణ్‌కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు. విజేతలకు డీడీ దిలీప్‌కుమార్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



హాకీ ఆడుతున్న క్రీడాకారులు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

22న దీపావళి జరుపుకోవాలి

- ఎంపీ సోయం బాపూరావు



కార్యక్రమానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: అయోధ్య శ్రీరామ మందిర బాల రాముని విగ్రహ ప్రతిష్టాపన నేపథ్యంలో ఈనెల 22న జిల్లా ప్రజలు దీపావళి జరుపుకోవాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో గురువారం నిర్వహించిన శ్రీకృష్ణానంద స్వామి ప్రవచనాల కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ శ్రీరామ మందిర ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందువుల 500 ఏళ్ల కల అయిన అయోధ్య రామ మందిర నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సాకారం అయ్యిందన్నారు. అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని యావత్ భారత దేశం కన్నుల పండువలా జరుపుకోనుందన్నారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పూర్కా బాపూరావు



మాట్లాడుతున్న పూర్కా బాపూరావు

నార్నూర్: ఆదివాసీలు హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పూర్కా బాపూరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కొమురంభీం భవన్‌లో తుడుందెబ్బ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది తెగల ఆదివాసీల హక్కుల సాధనే తుడుందెబ్బ లక్ష్యమన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మడావి మాన్కు, అధ్యక్షుడిగా అడ శ్రీరామ్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా మడావి సాగర్, ఉపాధ్యక్షులుగా ఆత్రం పరమేశ్వర్, మెస్రం ప్రభాకర్, కుర్సెంగ రాందాస్, మెస్రం హీరాలాల్, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ విఠల్, కోశాధికారిగా జుగ్నాక్ భీంరావు, కార్యదర్శులుగా సెడ్మకి భీంరావు, మడావి జైవంత్‌రావు, సహాయ కార్యదర్శులుగా మెస్రం చిత్రు, కుంరం నాందేవ్, ప్రచార కార్యదర్శులుగా మెస్రం మోతీరాం, మెస్రం లక్ష్మణ్, సలహాదారులుగా కనక గోపాల్, ఆత్రం భీంరావు, గోవింద్, చిత్రం రమేశ్, మెస్రం రూప్‌దేవ్ పటేల్, సిడాం మల్కుపటేల్, తుంరం మాల్‌పటేల్, కుంరం మాన్కులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ సీనియర్ నాయకులు మడావి మానిక్‌రావు, తొడసం నాగోరావు, ఉర్వేత రూప్‌దేవ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దాదిరావు, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ప్రవీణ్‌రెడ్డి



కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న ప్రవీణ్ రెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి గురువారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతి ఆదిత్య సింధియాను కలిశారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌కు కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లోక ప్రవీణ్ రెడ్డి కేంద్ర మంత్రిని కలిసి జిల్లాలోని రాజకీయ పరిస్థితులను గురించి కొద్దిసేపు చర్చించారు. అనంతరం ఆయనను సన్మానించారు. అనంతరం బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఇక్బాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి రచనా రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గావత్వాడికి చెందిన కలే కొండిభా భైంసా రూరల్ మండలంలోని బడగాం గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నాడు. తానూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి అదేగ్రామంలోని ఓ వ్యక్తి వద్ద వ్యవసాయ కూలీగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. అతని కుమార్తె (12) 2018, ఏప్రిల్ 17న బంధువులతో కలిసి జౌల(కే) వెళ్లింది. మరుసటిరోజు మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. ఆ సమయంలో తల్లిదండ్రులు ఇంటివద్ద లేకపోవడంతో ఆడుకుంటుండగా గమనించిన కొండిబా బాలిక వద్దకు వచ్చి పక్కనే మరో రేకుల షెడ్డులోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులతో బాలిక ఏడుస్తూ విషయం చెప్పడంతో భైంసా రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్సై ప్రభాకర్ కేసు నమోదు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు, స్పెషల్ పీపీ విశ్వాస్ రెడ్డి 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజుకు కావడంతో నిందితునికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కర్ణ కుమార్ గురువారం తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అంబరావు (ఫైల్)

నేరడిగొండ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాదవ్ అంబరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మాజీ ఎంపీ గొడం నగేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం మండలంలోని రాజురలో నిర్వహించిన అంత్యక్రియల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఆయన వెంట తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మాజీ జెడ్పీటీసీ కృష్ణకుమార్, నేరడిగొండ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ నాయకులు సాబ్లే నానక్‌సింగ్, సాబ్లే ప్రతాప్ సింగ్, గులాబ్ సింగ్, అంబేకర్ పండరి, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు ...

కుభీర్: మండలంలోని బాకోట గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం తానూరు మండలం మసల్గాకు చెందిన నీలేవార్ శివాజీ (32) బుధవారం తన అత్తగారి ఊరైన బాకోటకు వచ్చాడు. గురువారం తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు బీటీ రోడ్డుపైకి రావడంతో భైంసా నుంచి కుభీర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య రంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు ...

కౌటాల: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలంలోని గుండాయిపేట్‌కు చెందిన ఎల్ములే దిలీప్ (32) గురువారం ఉదయం బైక్‌పై పంటచేనుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుండాయిపేట గ్రామ సమీపంలో అడవిపంది అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఘటనలో దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

లోకేశ్వరం: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోట్‌పల్లికి చెందిన బోరిగామా గణేశ్ (23) చిన్నతనం నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతున్నాడు. ఈక్రమంలో గురువారం గ్రామ సమీపంలోని తన చేనులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..



ఎస్.కె.దాద్ (ఫైల్)

తాంసి: మనస్తాపంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో పొన్నారిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎస్.కె.దాద్ (30) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో పాటు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై శివరాం మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు...

లక్సెట్టిపేట: మండలంలోని దొడపల్లి గ్రామానికి చెందిన గాగిరెడ్డి లక్ష్మారెడ్డి (64) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మారెడ్డికి భార్య నర్సమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు కెనడాలో, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. దంపతులిద్దరూ ఇంటివద్దే ఉంటున్నారు. కుమారుడు సంక్రాంతికి ఇంటికి వచ్చి మళ్లీ హైదరాబాద్‌కు వెళ్తుండగా ఇద్దరమే ఉంటున్నామని బాధపడుతూ సాగనంపాడు. వృద్ధాప్యంలో ఎవరూ అందుబాటులో ఉండరని మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. భార్య నర్సమ్మ వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని కుమారుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్‌టౌన్: పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఎం.ప్రభాకర్‌పై పిచ్చి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రోజురోజుకూ పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పిచ్చి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

కేకే5 గనిపై కేబుల్ చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై గల ఎలక్ట్రికల్ మెటీరియల్ స్టోర్ నుంచి బుధవారం రెండోషిఫ్టులో విలువైన కేబుల్ చోరీకి గురైనట్లు (ఎస్అండ్‌పీసీ) జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారి తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి సుమారు 9.15 గంటలకు కొంతమంది దొంగలు ఒక్కసారిగా స్టోర్‌లోకి చొరబడ్డారు. విధి నిర్వహణలో ఉన్న గార్డుపై రాళ్లు రువ్వుతూ కర్రలతో బెదిరించారు. 70 మీటర్ల ప్లగ్‌తో ఉన్న ట్రెయిలింగ్ కేబుల్‌ను తీసుకెళ్లారు. కేబుల్ విలువ రూ.లక్షల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు బయటి నుంచి వచ్చారా? లేక స్థానికులేనా? అనే విషయం తేల్చాల్సి ఉంది. ఏదిఏమైనా సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది గనులపై పెట్రోలింగ్ ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

'ఈపీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ చేయాలి'

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఈపీఎఫ్ డబ్బులు తమ పీఎఫ్ ఖాతాలలో జమ చేయాలని నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గురువారం విలేజ్ నస్పూర్ టర్నింగ్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల నుండి మూడేళ్లుగా నెలకు రూ.1,900 చొప్పున ఈపీఎఫ్ డబ్బులు కట్ చేస్తున్నారని, వాటిని కార్మికుల పీఎఫ్ ఖాతాలలో జమ చేయడం లేదన్నారు. దీక్షలను యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాసరి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు మద్దెర్ల సతీష్, కోశాధికారి మాడ్గుల రాజం, నాయకులు గేరె లింగయ్య, అడ్లకొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు

- పాలిటెక్నిక్‌లో చేరేందుకు అవకాశం
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఈ నెల 31 తుది గడువు



మంచిర్యాల ఐటీఐ భవనం

మంచిర్యాలఅర్బన్: ఉజ్వల భవితకు పాలిటెక్నిక్ వారధిగా నిలుస్తోంది. కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశం లభిస్తోంది. ఇంత ప్రాధాన్యం ఉన్న పాలిటెక్నిక్ కోర్సులో నేరుగా చేరేందుకు ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కోర్సులో చేరేందుకు బ్రిడ్జి కోర్సులను అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ నెల 31వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది.

దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

పాలిటెక్నిక్‌లో చేరేందుకు ఐటీఐ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు ప్రవేశపెట్టారు. జిల్లాలో 12 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్, జన్నారంలో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా ఎనిమిది ప్రైవేట్ కళాశాలలున్నాయి. మంచిర్యాల ఐటీఐలో బ్రిడ్జి కోర్సు ప్రవేశానికి దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. పదో తరగతి మెమో, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 31లోపు దరఖాస్తులు సమర్పించవచ్చు. థియరీ, ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నారు. తర్వాత ఎల్పీ సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా 2024-25 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు కల్పించనున్నారు.

31తుది గడువు

ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న వారంతా పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నిర్వహిస్తున్న బ్రిడ్జి కోర్సు సద్వినియోగం చేసుకోవాలి. బ్రిడ్జి కోర్సులో ప్రవేశాలకు జిల్లాలో 40 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 31 వరకు తుది గడువు ఉందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 31లోపు దరఖాస్తులు చేసుకోవాలి.

– చందర్, ఐటీఐ ప్రిన్సిపాల్, మంచిర్యాల

హైవేపై బోర్‌వెల్ లారీ బోల్తా



బోర్‌వెల్ లారీ కింద ఇరుక్కున్న కూలీ



క్రేన్ సహాయంతో కూలీని బయటకు తీస్తున్న స్థానికులు

- వెనుకనుంచి ఢీకొట్టిన ఐచర్
- కూలీ, ఐచర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- క్రేన్ సాయంతో ఇరువురిని బయటకు తీసిన పోలీసులు

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది వద్ద బోర్‌వెల్ లారీని ఐచర్ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న బోర్‌వెల్ లారీని వెనుక నుంచి వేగంగా వస్తున్న ఐచర్ లారీ ఢీ కొట్టింది. దీంతో బోర్‌వెల్ లారీ రోడ్డు పైనే బోల్తా కొట్టింది. ఆ సమయంలో బోర్‌వెల్ లారీ క్యాబిన్‌లో నలుగురు యంత్రంపై వెనుక ఒకరు ప్రయాణిస్తున్నారు. క్యాబిన్‌లో ఉన్న వారికి ఏమీ కాకపోగా వెనుక కూర్చున్న కూలీ లారీ కింద ఇరుక్కుపోయాడు. అదే క్రమంలో ఐచర్ క్యాబిన్ నుజ్జునుజ్జు కాగా క్యాబిన్‌లో డ్రైవర్ చిక్కుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి రెండు క్రేన్‌లు తీసుకు వచ్చి ఇద్దరినీ బయటకు తీసి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో హైవేపై ఇరువైపులా మూడు కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సై ఇమ్రాన్ సహాయకచర్యల్లో పాల్గొన్నారు.

పక్షుల బెడద లేకుండా.. పంటను కాపాడుకునేలా..

తలమడుగు మండలం పల్సిబి తండాలో రాథోడ్ ఘన్ శ్యాం తన జొన్నపంటను కాపాడుకునేందుకు చేసిన ఆలోచన అదిరింది. అటవీ ప్రాంతంలో గల చేనులో పక్షుల బెడద అధికంగా ఉండటంతో పంట చేను చుట్టూ ఇలా చేపల వలను ఏర్పాటు చేశాడు. చేను మధ్యలో మంచె ఏర్పాటు చేసుకుని రాత్రి వేళ అక్కడే ఉంటూ శబ్దాలు చేస్తూ పక్షులు రాకుండా జాగ్రత్త పడుతున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





పంట చుట్టూ ఏర్పాటు చేసిన చేపల వల